హెచ్ఎంపీవీపై అవగాహన


మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: గ్రామాల్లో ఆశావర్కర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి హెచ్ఎంపీవీ నివారణకు అవగాహన కల్పించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి ఆశా డే సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చేతులు శుభ్రపరుచుకోవడంపై, మాస్కులు ధరించడం, కాచి చల్లార్చిన నీటి ఆవశ్యకతపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 10 అర్జీలు

బంగారుపాళెం: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం కాటప్పగారిపల్లెలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేపనపల్లెలో రెవెన్యూ గ్రామ సభలను నిర్వహించారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి 10 అర్జీలు వచ్చాయన్నారు. మండల సర్వేయర్ లావణ్య, వీఆర్‌ఓలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతోనే భవిష్యత్తు

- ఏఐతో వేగవంతంగా పురోగతి
- జాతీయ సెమినార్‌లో వీఐటీ ప్రొఫెసర్ అయ్యప్పన్


మాట్లాడుతున్న వీఐటీ ప్రొఫెసర్ అయ్యప్పన్

చిత్తూరు కలెక్టరేట్ : కృత్రిమ మేధస్సుతోనే భవిష్యత్తు ఉంటుందని వీఐటీ ప్రొఫెసర్ అయ్యప్పన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం కృత్రిమ మేధస్సు జాతీయ సెమినార్ నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రపంచ వ్యాప్తంగా వేగవంతంగా పురోగతి సాధిస్తోందన్నారు. విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది ఒక ముఖ్యమైన అంశంగా మారిందన్నారు. దేశంలోని అనేక పాఠశాలల్లో ఇప్పటికే ఏఐ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నరేంద్ర మాట్లాడుతూ ప్రస్తుత తరంలో ఏఐ అన్ని రంగాల్లో దుసుకుపోతోందన్నారు. భవిష్యత్తులో ఏఐకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. కృత్రిమ మేధతో అనేక ఉపయోగాలు ఉంటాయని సదస్సు సంచాలకులు ప్రొఫెసర్ వినీల అన్నారు. భావి పౌరులైన విద్యార్థులకు ఏఐ ప్రాధాన్యతను తెలియజేసేందుకే జాతీయ సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. అన్ని రంగాలపై ఏఐ ప్రభావం చూపిస్తోందని తెలిపారు. డీఆర్‌డీఏ శాఖ జిల్లా మేనేజర్ సరితారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కృత్రిమ మేధ విద్యలో ఉన్న అవకాశాలను తెలియజేశారు. ఎస్వీ యూ కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు మానవ మేధస్సుకు ఎన్నడూ ప్రత్యామ్నాయం కాలేదని అయితే భవిష్యత్తులో కృత్రిమ మేధస్సుకే అధిక అవకాశాలు ఉంటాయన్నారు. విజయం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోపి మాట్లాడుతూ మారుతున్న కాలాలకు అనుగుణంగా విద్యార్థులు కొత్త కోర్సులు నేర్చుకోవాలన్నారు. అపోలో యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరామన్ మాట్లాడుతూ 2015 నుంచి 2019 వరకు ఏఐ అప్లికేషన్లలో 270 శాతం వృద్ధి జరిగిందని గార్ట్‌నర్ 2019 నివేదిక అంచనా వేసిందన్నారు. అనంతరం పరిశోధనా సంకలనాన్ని ఆవిష్కరించారు. అనంతరం కళాశాల విద్యార్థినుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సదస్సులో కళాశాల అధ్యాపకులు తిరుకుమరన్, ఉషారాణి, షమ్స్ అక్తర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ అధ్యాపకుడి మృతి


మొగిలయ్యశెట్టి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకునిగా పనిచేసి విరమణ పొందిన చరిత్ర అధ్యాపకులు మొగిలయ్యశెట్టి (72) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. జిల్లాలోని ఐరాల మండలం పైపల్లె సమీపంలోని వడ్డిపల్లెలో జన్మించిన 40 ఏళ్ల పాటు బోధనా వృత్తిలోనే ఉన్నారు. ఆయన అంత్యక్రియలు బుధవారం చిత్తూరు నగరంలోని బీఎంఆర్ గార్డెన్‌లోని స్వగృహంలో జరుగుతాయని కుటుంబసభ్యులు వెల్లడించారు.

మంగళ విద్యావాణి 32వ సంచిక ఆవిష్కరణ

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మంగళ విద్యావాణి 32వ సంచికను హెచ్ఎం రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో విశ్రాంత ఉపవిద్యా శాఖ అధికారి వాసుదేవనాయుడు ఆవిష్కరించారు. ఈ సంచికకు నలగాంపల్లెకు చెందిన ధరణి ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు.

గజ దాడులకు శాశ్వత పరిష్కారం చూపండి


కుప్పంలో సీఎంకు వినతి పత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమాపతినాయుడు

బంగారుపాళెం: ఏనుగుల దాడుల నుంచి రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా రైతు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఉపాపతినాయుడు, వెంకట్రామిరెడ్డి మంగళవారం సీఎం చంద్రబాబుకు వినతి పత్రాన్ని సమర్పించారు. కుప్పం పర్యటనకు విచ్చేసిన సీఎంను రైతు సంఘం నాయకులు కలసి జిల్లాలో ఏనుగు దాడుల వల్ల జరుగుతున్న పంట నష్టం, ఏనుగు దాడుల జరగకుండా రైతుల పంటలకు రక్షణ కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. తమిళనాడు, కర్ణాటక నుంచి జిల్లాలోకి ఏనుగులు ప్రవేశించాయన్నారు. ప్రస్తుతం వాటి సంఖ్య 120 వరకు ఉన్నాయని చెప్పారు. ఏనుగులు గుంపులు గుంపులుగా విడిపోయి, జిల్లాలోని అటవీ సరిహద్దు ప్రాంతాలైన కుప్పం, రామకుప్పం, పలమనేరు, బంగారుపాళెం, పులిచెర్ల తదితర ప్రాంతాల్లో సంచరిస్తూ రైతుల పంటపొలాలను నాశనం చేస్తున్నాయని తెలిపారు. దీంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. రైతుల పంట పొలాలపైకి ఏనుగులు దాడులు చేయకుండా పటిష్టమైన నివారణ చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు.


వర్గీకరణలో ఉప కులాలను నమోదు చేయండి


నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

తవణంపల్లె: ఎస్సీ వర్గీకరణ కోసం ఉప కులాలను నమోదు చేసి మాదిగలకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట కె.పట్నం మాదిగ కులస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఉప కులాలను నమోదు చేయకుండా అధికారులు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

వాణిజ్య కేంద్రంగా చిత్తూరు

- పెద్ద నగరాలను తలదన్నేలా వ్యాపారాలు
- అందుబాటులో ఆధునిక విద్య, సాంకేతిక వైద్యం
- పుంజుకుంటున్న రియల్ ఎస్టేట్



చిత్తూరు అర్బన్/కాణిపాకం: ఉత్తర ఆర్కాడు జిల్లాలోని కుగ్రామం ఈ చిత్తూరు. నాటి మద్రాసు రాష్ట్రంలోని అంతర్భాగం. 1911 ఏప్రిల్ 1న ఆవిర్భవించిన గ్రామం సకల కళల సమ్మేళనం. అటు తమిళనాడులో పురుడుపోసుకుని, ఆంధ్ర రాష్ట్రంలో పెరిగి, కన్నడిగులకు చేరువగా ఉన్న చిత్తూరు నగరం ప్రస్తుతం వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. బెంగళూరు, చెన్నైలాంటి మహా నగరాలకు గంటల్లోనే వెళ్లగలిగే కనెక్టివిటీ ఉండడంతో ఆధునిక వ్యాపార రంగంలో సరికొత్త వస్తువులను ప్రజలకు పరిచయం చేస్తోంది.

విద్యా రంగంలో గత దశాబ్దకాలంతో పోలిస్తే చిత్తూరులో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రాథమిక విద్య, ఉన్నత విద్యను అందించే విద్యా సంస్థలు చిత్తూరులో మంచి పట్టును సాధించాయి. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్లే స్కూల్ నుంచే పిల్లల ఆలోచనా విధానంలో సరికొత్త మార్పులు తీసుకొస్తూ విద్యా బోధన చేస్తున్నారు. అధునాతన సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ గదులతో పాటు ఇపుడంతా టెక్నాలజీని అనుసంధానం చేస్తున్నారు. చిత్తూరులో మెడికల్ కళాశాలలు సైతం అందుబాటులో ఉండడం మరో వరంగా మారింది. డీమ్డ్ యూనివర్సిటీలతో పాటు మెడికల్ అల్లాయ్ సైసెన్స్ కోర్సులు, పారా మెడికల్ కోర్సులు అందుబాటులోకి రావడంతో కోర్సు పూర్తిచేసిన వాళ్లకు ఉద్యోగ అవకాశాలు కూడా వస్తున్నాయి.

అందుబాటులో వైద్యసేవలు

ఒకప్పుడు చిన్నపాటి వైరల్ ఫీవర్ వస్తే తమిళనాడులోని వేలూరు, బెంగళూరు లాంటి ప్రాంతాలకు పరుగు పెట్టే వాళ్లు. కానీ వైద్య రంగంలోనూ చిత్తూరులో అధునాతన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, డయాగ్నస్ సెంటర్లు ఏర్పాటు కావడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా చిత్తూరు వాసులకు ఇక్కడే అధునాతన వైద్య సేవలు అందుతున్నాయి. కార్పొరేట్ ఆస్పత్రులు జనరల్ ఫిజీషియన్ నుంచి ఆర్థో, డెంటల్, డెర్మటాలజీ, పిడియాట్రీషన్, సర్జన్, కార్డియో స్పెషలిస్టుల ద్వారా మంచి వైద్య సేవలను అందిస్తున్నాయి.

నాణ్యమైన దుస్తుల విక్రయం



ప్రజలకు నాణ్యమైన దుస్తులను విక్రయించడమే లక్ష్యంగా పచ్చయ్యపాస్ సిల్క్స్ ముందుకెళుతోందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుందర్ గణేష్ అన్నారు. తమిళనాడులోని కాంచీపురంలో తొలి వస్త్ర దుకాణాన్ని ప్రారంభించామన్నారు. ప్రస్తుతం తమిళ, తెలుగు ప్రజలకు అవసరమైన మేర రకరకాల దస్తులను వేలూరులో ఉన్న దుకాణంలో అమ్మకానికి ఉంచామన్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఇస్తూ, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకుంటున్నామన్నారు.

రియల్ రంగానికి ఊతం

రియల్ ఎస్టేట్ రంగంలో చిత్తూరు పుంజుకుంది. పరిసరాల్లోని 25 మండలాలను కవర్ చేస్తూ చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) ఏర్పడడంతో రియల్ ఎస్టేట్ రంగానికి ఉన్న హద్దులు చెరిగిపోయాయి. చిత్తూరు నుంచి 20 కి.మీ. పరిధి వరకు పలు కంపెనీలు, వ్యక్తులు లే-అవుట్లను నిర్మించి అప్రూవ్డ్ ప్లాట్లను అందుబాటు ధరల్లో విక్రయిస్తున్నారు. ఇదే సమయంలో అపార్టుమెంటు సంస్కృతి పెరుగుతుండడంతో ఆ దిశగా కూడా చిత్తూరులో విక్రయాలు బాగా జరుగుతున్నాయి.

వ్యాపార కేంద్రంగా రూపాంతరం

ఆటోమొబైల్, పారిశ్రామిక రంగంగా కూడా చిత్తూరు వాణిజ్య కేంద్రంగా రూపాంతరం చెందుతోంది. ద్విచక్ర వాహనాల నుంచి కార్లు, లగ్జరీ క్యారవాన్ల వరకు చిత్తూరు రోడ్లపై తిరుగుతుండడం ఇక్కడి వ్యాపార రంగ అభివృద్ధికి సూచికగా నిలుస్తోంది. జిల్లా రవాణా శాఖ ఇక్కడే ఉండడంతో ద్విచక్ర వాహనాల కంపెనీలతో పాటు ప్రముఖ కార్ల కంపెనీలు, టిప్పర్లు, ఎర్త్ మూవర్ల కంపెనీలు చిత్తూరులో బ్రాంచ్‌లను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నాయి. పలు ప్రధాన హోటళ్లు అందించే వంటలు తెలుగు, తమిళ సంస్కృతులకు అనుగుణంగా ఉంటున్నాయి.

అంతర్జాతీయ ప్రమాణాలతో చికిత్స

అంతర్జాతీయ ప్రమాణాలతో పాల్స్ ఫిజియోథెరపీ క్లినిక్‌లో 25 ఏళ్లుగా చికిత్స అందిస్తున్నామని ఆర్థో పెడిక్ ఫిజియోథెరపిస్ట్ జైదీప్ పాల్ తెలిపారు. ఆయన చిత్తూరు నగరం టీవీనాయుడు వీధిలోని తన క్లినిక్‌లో విలేకరులతో మాట్లాడారు. రాయలసీమలోనే తొలిసారిగా మాన్యువల్ థెరపీ చికిత్సను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. తద్వారా కచ్చితమైన ఫలితం సాధిస్తున్నట్లు తెలిపారు. కీళ్లు, కండరాలు, నరాల సమస్యలతోపాటు బరువు తగ్గడానికి ప్రత్యేక చికిత్స ఇస్తున్నామన్నారు.

మనసు దోచే 'ఆంధ్ర స్పైసీ'

బిర్యానీ ప్రియులకు మెచ్చేలా ఆంధ్ర స్పైసీలో సంక్రాంతి ఆఫర్లు ఇస్తున్నట్లు హోటల్ నిర్వాహకులు మహిధర్‌రెడ్డి తెలిపారు. సంక్రాంతి సందర్భంగా దర్గా సర్కిల్‌లోని ఆంధ్రస్పైసీలో ఆఫర్లను వివరించారు. అనతికాలంలోనే ఈరెస్టారెంట్ నాన్ వెజ్ ప్రియుల మనసు దోచేసిందని వెల్లడించారు. ఆహారంలో శుభ్రత, రుచికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

ఆన్‌లైన్ కంటే తక్కువ ధరకే విక్రయాలు



ఆన్‌లైన్ కంటే తక్కువ ధరకే ఎలక్ట్రానిక్ వస్తువులను అమ్మకం చేస్తున్నట్లు వినోద్ ఎలక్ట్రానిక్స్ అధినేత వినోద్ తెలిపారు. నగరంలోని వేలూరు రోడ్డులో ఉన్న వినోద్ ఎలక్ట్రానిక్స్ రాయలసీమలోనే అతి పెద్దదని చెప్పారు. ఈ షోరూంలు రాయలసీమ వ్యాప్తంగా ఉన్నాయని వివరించారు. ఈ షోరూంలో ఆన్‌లైన్ కంటే తక్కువ ధరకు ఉత్పత్తులను అందిస్తున్నామన్నారు. జీరో డౌన్ పేమెంట్ సదుపాయాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

మధుమేహ బాధితులకు ఓపీ ఉచితం

చిత్తూరు నగరం గాంధీరోడ్డులోని ఇందిరా హాస్పిటల్‌లో అత్యున్నత వైద్యంతోపాటు అత్యవసర సేవలందిస్తామని వైద్యులు సురేష్, లివిజ వెల్లడించారు. ప్రతి రోజు మధుమేహ బాధితులకు ఓపీ ఉచితమన్నారు. మధుమేహానికి మెరుగైన చికిత్స, మహిళలు, పిల్లలకు ప్రత్యేక సేవలు అందిస్తామని చెప్పారు. థైరాయిడ్, బీపీ, పాయిజనింగ్ కేసులు, గుండె జబ్బులు, కిడ్నీ, పక్షవాతం, నరాల బలహీనత తదితర సమస్యలకు వైద్యం అందిస్తున్నట్లు వివరించారు.